

విద్యార్థుల్లో పోటీతత్వం ముఖ్యం

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థుల్లో పోటీతత్వం ముఖ్యమని ఎంఇఒ గంగిరెడ్డి పేర్కొన్నారు. బాలోత్సవ కమిటీ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను ఎస్వి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం విజయవంతంగా నిర్వహించారు. చిత్రలేఖనంలో 349 మంది, వ్యాసరచనలో 299 మంది విద్యార్థులు దాదాపు 74పాఠశాలల నుంచి హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలోత్సవం అధ్యక్షులు గోపాల్, సలహాదారు వీర సుదర్శన్ రెడ్డి, కడప ఎంఇఒ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని చిత్ర లేఖనం,వ్యాసరచన నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్ రాహుల్, సునీత, మృత్యుంజయ రావు, దేవదత్తం, బాలయల్లా రెడ్డి, సుందరయ్య, వెంకటేశ్వర్లు, అరుణ, మధుసూధన్, సరస్వతి హాజరయ్యారు.



తొలగింపులపై నేడు స్కీమ్ వర్కర్ల నిరసనలు

◆ కడప, అన్నమయ్య జిల్లాల్లో కార్మికుల శంఖారావం

తొలగింపు, బెదిరింపులకు నిరసనగా స్కీమ్‌వర్కర్ల ఆందోళనలకు శ్రీకారం చుట్టారు. సోమవారం కడప, అన్నమయ్య జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో కదం తొక్కనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తున్న తమను తొలగిస్తామనే పేరుతో వేధింపులకు గురి చేయడాన్ని గర్హిస్తూ ఉక్కు పిడికిలి బిగించనున్నారు. రాష్ట్రంలో అధికారం మారినప్పడల్లా ఆందోళనకు చేరిచేయడం ఫ్యాషన్‌గా మారిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇందులోభాగంగా కడప, అన్నమయ్య జిల్లాల వ్యాప్తంగా పలువురు అంగన్వాడీలు, విఒఎలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు తొలగింపు, బెదిరింపులపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. బెదిరింపులకు కొనసాగింపుగా శనివారం సంబేపల్లి మండలం పెద్ద జంగంపల్లికి చెందిన అంగన్వాడీ ఆత్మహత్యాయత్నం చేయడం ఆం దోళన కలిగిస్తోంది.

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

ఉభయ జిల్లాల్లోని స్కీమ్‌వర్కర్ల తొలగింపు, బెదిరింపు ప్రయత్నాలకు ప్రతిఘటన ఎదురవుతోంది. ఇందుకు సిఐటియు నాయకత్వం వహిస్తోంది. ఇందులోభాగంగా కడప, అన్నమయ్య జిల్లాల కలె క్టరేట్‌ల ఎదుట పెద్దఎత్తున ఆందోళనలకు కసరత్తు చేసింది. ఈమేరకు సోమవారం కలెక్టరేట్‌ల ఎదుట పెద్దఎత్తున ఆందోళనలు చేయనున్నారు. కడప జిల్లాలో అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, యానిమేటర్లు విఒఎలు, ఆప్కాస్ కింద కాంట్రాక్టు కార్మికులు సుమారు 10 వేల మంది ఉన్నారు. అన్నమయ్య జిల్లాలో సుమారు 12 వేల మంది స్కీమ్ వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి రావడంతో అధికార పార్టీ పలువురు స్కీమ్ వర్కర్లను తొలగిస్తామనే పేరుతో బెదిరింపులకు పాల్పడుతోంది. ఇందులోభాగంగానే అన్నమయ్య జిల్లా సంబేపల్లి మండలం పెద్దజంగంపల్లికి చెందిన జె.నాగరత్నమ్మ అనే అంగన్వాడీ వేధింపులకు తాళలేక శనివారం ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. చిన్నమండెం మండలానికి చెందిన మరో ఇద్దరు అంగన్వాడీలను బెదిరింపులకు గురి చేయడం ఆందోళన కలిగిస్తోంది. వీరితోపాటు కలకడ మండలంలోని రాతిగుంటపల్లికి చెందిన సంఘ మిత్ర విజయకుమారి, దేవరపల్లికి చెందిన రెడ్డిలక్ష్మిలను తొలగిస్తామని పేరుతో బెదిరింపులకు పాల్పడడం ఆందోళన కలిగిస్తోంది. మూడేళ్ల కాలపరిమితి పూర్తి చేసిన సంఘ మిత్రలను తొలగించాలని ఒత్తిళ్లకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. కడప జిల్లాలోని ముద్దనూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కొండాపురం సెక్టార్‌లో ఐదుగురు అంగన్వాడీలను రాజీనామా చేయాలని ఒత్తిడి చేయడం, జమ్మలమడుగులో మధ్యాహ్న భోజన కార్మికులను బలవంతంగా రాజీనామా చేయాలని ఒత్తిడి చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. వీరితోపాటు జిల్లాలోని వేంపల్లి, కమలాపురం, సింహాద్రిపురం మండలాలకు చెందిన పలువురు అంగన్వాడీల తొలగింపు ప్రయత్నాలు చేయడం తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి బెదిరింపు, తొలగింపు ప్రయత్నాలకు నిరసనగా సిఐటియు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్య క్రమాలను తీసుకుని స్కీమ్‌వర్కర్ల పక్షాన నిలిచి గళమెత్తతుండడం గమనార్హం.



సంబేపల్లెలో రాజకీయ వేధింపులు తాళలేక ఆత్మహత్యకు యత్నించిన నాగరత్నమ్మ

ప్రజా రవాణా వ్యవస్థలో మెరుగైన సేవలే లక్ష్యం

రవాణా, యువజన, క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలతో పాటు వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలనే సదుద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అద్దె (హైర్) బస్సుల సేవలను వినియోగిస్తోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆదివారం కడప ఆర్‌టిసి నూతన గ్యారేజీ ప్రాంగణంలో కడప రీజన్‌లోని వివిధ డిపోలకు చెందిన 18 నూతన బస్సులను జెండా ఊపి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారవాణా వ్యవస్థలో ప్రజలకు అత్యంత భద్రత, సులభతర సుఖమయ ప్రయాణ సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రభుత్వం విస్తృతంగా అద్దె (హైర్) బస్సుల సర్వీసులను అందు బాటులోకి తెచ్చిందన్నారు. ప్రభుత్వ పరిధిలో ప్రజా సేవలను అందిస్తున్న హైర్ బస్సుల ఓనర్లందరికీ శుభాభినందనలు తెలుపుకుం టున్నా మన్నారు. ఐదేళ్లలో ఎపిఎస్ ఆర్టిసి పూర్తిగా నిర్వీర్యం అయిం దన్నారు. రాబోయే కాలంలో ఎపిఎస్‌ఆర్‌టిసిని ప్రక్షాళన చేసి, ప్రయాణికులకు నాణ్యమైన సేవల అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర రవాణా వ్యవస్థ ద్వారా మరిన్ని నూతన ఆర్‌టిసి బస్సులను కొనుగోలు చేసి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయాన్ని కూడా అతి త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా వందల సంఖ్యలో అద్దె బస్సులకు ప్రభుత్వం టెండర్లు పిలిచిందని, ప్రభుత్వం ఏర్పడ్డ రెండు నెలల్లోనే సుమారు 1400 నూతన బస్సులు ఎపిఎస్ ఆర్‌టిసి పరిధిలోకి వచ్చాయని, ఇప్పటికే 400 బస్సులు సర్వీసులు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం కడప డిపో నుంచి 18 నూతన బస్సు సర్వీసులు వివిధ ప్రాంతాలకు ప్రజారవాణా సర్వీసులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఇందులో రెండు ఇంద్ర, ఒక సూపర్ లగ్జరీ, మిగతా పల్లెవె లుగు, ఎక్స్ ప్రెస్, డీలక్స్, బస్సులు ఉన్నాయన్నారు. కడప ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ మన జీవనంలో ఆర్‌టిసి బస్సు ఒక భాగమని, గ్రామాలకు కూడా బస్సులు వెళుతుందని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో ముఖ్యంగా మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. అతి త్వరలోనే మహిళామూర్తులకు ఒక శుభవార్త చెబు తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి, బద్వేల్, జమ్మలమడుగు నియోజకవర్గ నాయకులు విజయమ్మ, భూపేశ్ రెడ్డి, ప్రజా రవాణా అధికారి గోపాల్ రెడ్డి, డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ లక్ష్మీ భాస్కర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటరమణ, జిల్లాలోని 6 డిపోల డిపో మేనేజర్లు, అద్దె బస్సుల యజమానులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.



నూతన బస్సులను జండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యే మాధవి

ఉత్తమ ఫలితాలకు ప్రణాళిక

- ప్రతి పాఠశాలలో ప్రత్యేక తరగతులు
- బ్రిడ్జి కోర్సుల్లో వెనుకబడిన విద్యార్థులు
- పాఠశాల కమిటీ ఎన్నికలు షురూ
- జిల్లా విద్యాశాఖాధికారి ఎం.అనురాధ

ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

టెన్త్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు ప్రణాళిక రూపొందించాం. జిల్లావ్యాప్తంగా ప్రతిపాఠశాలలోనూ టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఐదవ తరగతి ఉత్తీర్ణులై ఆరవ తరగతికి వచ్చిన వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి బ్రిడ్జి కోర్సుల కింద తర్ఫీదునిచ్చే ప్రయత్నం చేస్తున్నాం. ఇంతటితో ఆగకుండా పాఠశాలల అభ్యున్నతికి ఉద్దేశించి పాఠశాలల కమిటీ ఎన్నికలు నిర్వహిస్తున్నాం. ఈనెల ఒకటి నుంచి ఎనిమిదవ తేదీలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. దీంతోపాటు పాఠశాలలో స్కూల్ న్యూట్రిషన్ గార్డెన్ పేరుతో పాఠశాలల్లోనే కూర గాయలు, ఆకుకూరలు, పండ్లు పండించే ప్రయత్నం చేస్తు న్నామని పేర్కొంటున్న జిల్లా విద్యాశాఖాధికారి యం. అనురాధతో ప్రజాశక్తి ముఖాముఖి..



బ్రిడ్జి కోర్సుల ఉద్దేశం ఏమిటి?

ఐదవ తరగతి ఉత్తీర్ణులై ఆరవ తరగతిలోకి వచ్చిన విద్యార్థుల్లో వెను కబడిన వారిని గుర్తించాలి. బేసిక్‌లో బలహీనపడిన వారిని గుర్తించి లెర్నింగ్, రీడింగ్ లెవల్స్‌లో ప్రత్యేకంగా తర్ఫీదునిచ్చే ప్రయత్నాలు ముమ్మరం చేశాం.

ప్రత్యేక తరగతుల గురించి చెప్పండి?

అకడమిక్ ఇయర్ ప్రారంభం నుంచే టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. అదనపు స్టడీ అవర్స్ మొదలుకుని ఆయా సబ్జెక్టు నిపుణ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో తర్ఫీదు ఇవ్వడం జరుగుతోంది. ఇటువంటి ముందస్తు ప్రణాళిక ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా మెరుగైన స్థానంలో జిల్లాను ఉంచేలా ముందుకెళ్తున్నాం.

స్కూల్ కిట్స్ పంపిణీ ఎలా ఉంది?

జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలకు చెందిన విద్యార్థులందరికీ స్కూల్ కిట్స్ అందజేయడమైంది. ఇందులోభాగంగా 1,44,780 బ్యాగులు, 99,725 బెల్టులు, 8,9960 నోట్‌పుస్తకాలు, 17536 డిక్షనరీలు, 10,989 విక్టోరియల్ డిక్షనరీలు, 1,42,765, షఉస్, షాక్సులు, 9,52,905 టెక్స్ట్‌బుక్స్, 1,42,780 యూనిఫామ్స్, 2,4 5, 372 వర్క్‌బుక్స్ పంపిణీ చేయడమైంది.

పాఠశాలల వివరాలు తెలపండి?

జిల్లాలో 2,832 పాఠశాలలున్నాయి. ప్రైమరీ పాఠశాలలు 1902, మున్సిపల్ 84, ఎయిడెడ్ 66, ప్రయివేట్ 773, మద రసాలు 07 వరకు ఉన్నాయి.

జిల్లాలోని విద్యార్థుల సంఖ్య ఎంత?

జిల్లాలోని 2,832 పాఠశాలల పరిధిలో 3,26,752 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో ప్రైమరీ పాఠశాలల్లో 1,22,955 మంది, మున్సిపల్ స్కూళ్లలో 4,884 మంది, ఎయిడెడ్‌లో 7,666 మంది, ప్రయివేటులో 1,80, 941 మంది, మదరసాల్లో 306 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు.

పాఠశాలల కమిటీ ఎన్నికలు ఎప్పుడు?

ఈనెల ఒకటి నుంచి ఎనిమిదవ తేదీలోపు పాఠశాలల కమిటీలకు ఎన్నికలు నిర్వహించాలి. ఇందులోభాగంగా అన్ని పాఠశాలలకు ఆదేశాలు జారీ చేశాం. ప్రతి తరగతికి ముగ్గురు చొప్పున కమిటీలో ఉండాలి. ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు 15 మంది ఉండాలి.

స్కూల్ న్యూట్రిషన్‌గార్డెన్స్ ఉద్దేశం ఏమిటి?

విద్యార్థులకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడమే. ఇందులోభాగంగానే ప్రతి పాఠశాలలో స్కూల్ న్యూట్రిషన్ గార్డెన్స్ ఏర్పాటు చేయాలి. దీనికి ఉపాధి హామీ పథకం పథకం సహాయంతో ఫారెస్ట్ సహ మరో మూడు డిపార్టుమెంట్ల సహకారంతో గార్డెన్స్ ఏర్పాటు చేయాలి. ఇందులో కూరగాయలు, ఆకు కూరలు, పండ్లు మొదలగు పంటలు పండించే విధానాల పట్ల అవగాహన కల్పించడం జరుగుతుంది.

పిఎం పోషణ్ పథకం మార్పుపై మీరేమంటారు?

పిఎం పోషణ్ పథకాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంగా మార్పు చేశారు. ఆమె ఆకలి భూతంపై చేసిన పోరాటానికి గుర్తుగా డొక్కా సీతమ్మ పేరుతో పథకాన్ని తీసుకు రావడం జరిగింది.

ప్రహరీక్లబ్స్ అంటే ఏమిటి?

పొగాకు, గంజాయి వ్యవసనాలకు దూరంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రహరీ క్లబ్స్ పేరుతో అవేర్‌నెస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ప్రతి పాఠశాలలోని కొంతమంది ఉపాధ్యాయులు, కొంత మంది చురుకైన విద్యార్థుల సహాయంతో పొగాకు, గంజాయి బారిన పడిన సహ విద్యార్థులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా బాగు చేసుకునే ప్రక్రియే ఇది.



విజేత జట్టుతో ఎమ్మెల్యే మాధవి

యువకులు సమాజ శ్రేయస్సుకు పాటుపడాలి

- కడప ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి - కడప అర్బన్

యువకులు క్రీడల్లో రాణిస్తూ సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని కడప ఎమ్మెల్యే మాధవి పిలుపునిచ్చారు. ఆదివారం కడప పోలీస్ క్రికెట్ గ్రౌండ్‌లో ధోని ట్రోఫీ 2024 ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లీగ్ నిర్వహించిన కడప నైట్ రైడర్స్ అధ్యక్షులు యం.తారిఖ్ అలీ, వారి మిత్ర బృందాన్ని అభినందించారు. స్పాన్సర్లుగా వ్యవహరించిన స్టార్ చికెన్,పి.యస్ డిజైన్, ఎంఎంహాస్పిటల్,మెట్రో కంప్యూటర్స్, సంగం డెంటల్, సలావుద్దీన్ క్రీడా కారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. టిడిపి నగర ఉపాధ్యక్షుడు పి..మన్సూర్ అలీ ఖాన్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగుతూ, రక్తదానం, సమాజ శ్రేయస్సు కోసం పని చేయాలని కోరారు. ధోని పేరు మీద జరిగే ఈ లీగ్‌లో పాల్గొన్న 4 టీములకు కృతజ్ఞతలు తెలిపారు. టోర్నమెంట్‌లో ఒక జట్టు మాత్రమే ఫైనల్లో గెలుస్తుంది చెప్పారు. రన్నర్స్‌గా నిలిచిన క్రీడాకారులు భవిష్యత్తులో జరిగే టోర్నమెంట్లలో మరింత కష్టపడి గెలుపును అందుకోవాలని కోరారు. ధోని ట్రోఫీ 2024 నిర్వాహకుడు, కె.కె.ఆర్ అధ్యక్షుడు తారిఖ్ అలీ మాట్లాడుతూ ధోని ట్రోఫీ 2024 ఫైనల్ మ్యాచ్‌కు విచ్చేసిన అతిధులు, ముఖ్య అతిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఫైనల్ మ్యాచ్ వివరాలు తెలుపుతూ రవీంద్ర నగర్ -11, అల్మాస్‌పేట -11 మధ్య జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన రవీంద్ర నగర్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 157 పరుగులకు 7 వికెట్లు కోల్పోయింది.158 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి బ్యాటింగ్ దిగిన ఆల్మాస్‌పేట- 11 జట్టు 19.1 ఓవర్లలో 158 పరుగులు చేసి 6 వికెట్లు మాత్రమే కోల్పోయింది. ఆల్మాస్‌పేట-11 జట్టు తమ అద్భుతమైన ఆట తీరుతో ధోని ట్రోఫీ - 2024 ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది.అల్మాస్‌పేట జట్టు తరపున 30 బంతుల్లో 54 పరుగులు చేసిన సందీప్‌కు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అందజేశారు. టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శన చేసిన రవీంద్ర నగర్ క్రీడాకారుడు ఫజల్‌కు మ్యాన్ ఆఫ్ దీ సిరీస్ అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు జీలాన్, డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు డాక్టర్ నజీముద్దిన్, పిఎస్ డిజైన్ అధినేత ఇంతియాజ్ అహమద్,మెట్రో కంప్యూటర్స్ అధినేత నాసర్ అహమద్, ఖున్ కా రిష్త సెక్రటరీ గౌస్, జెకె యూత్ అధ్యక్షుడు పఠాన్ ఖాదర్ బాషా ఛాంపియన్లుగా నిలిచిన అల్మాస్‌పేట కెప్టెన్ బాలాజీ జట్టు, రన్నర్లుగా నిలిచిన రవీంద్ర నగర్ కెప్టెన్ తాజ్ జట్టుకు అందజేశారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి-కడప అర్బన్

శ్రీ సాయి జూనియర్ కళాశాల ప్రథమ సంవత్సర ఆహ్వాన వేడుకలు ఆదివారం అపూర్వ కళ్యాణమండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ పి.రాజ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని చెప్పారు. కష్టపడితే సాధించలేనిది ఏమీ లేదని పేర్కొన్నారు. డైరెక్టర్ పి. ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కష్టపడి, ఇష్టపడి చదివితే మీరు అనుకున్నది సాధిస్తారని చెప్పారు. ప్రిన్సిపల్ ఈశ్వరమ్మ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో ఆశలతో కళాశాలలో మిమ్మల్ని చేర్పించారని, వారి ఆశయాలు అనుగుణంగా చదివితే ఎంతో సంతోషిస్తారని చెప్పారు. అలాగే ఫౌండర్ కె.మల్లేశ్వరి మాట్లాడుతూ క్రమశిక్షణతో, విలువలతో కూడిన విద్య తో పాటు పెద్దలపట్ల గౌరవాన్ని ఇవ్వాల్సిన అవసరం నేటి విద్యార్థుల మీద ఉన్నదని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జయప్రకాశ్ రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి.



సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎన్‌ఆర్‌ఐలు

ప్రజాశక్తి - కడప

కాంగ్రెస్ పార్టీ నాయకులు అఫ్జల్‌ఖాన్ ఆధ్వ ర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో ఎన్‌ఆర్‌ఐలు రఫీ ఖాన్, అబ్దుల్ సలాం చేరారు. వారికి అఫ్జల్ ఖాన్ పార్టీ కండు వాను పార్టీ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం అఫ్జల్ ఖాన్ మాట్లా డుతూ వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ముస్లిములకు చాలా మేలు జరిగిందని అన్నారు. ఇప్పుడున్న టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు పరచాలంటే భయమేస్తుందని, అమలు పరచలేమంటూ చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తుందన్నారు. ఐదు సంవత్సరాలు తర్వాత కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.



ఎన్‌ఆర్‌ఐలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అఫ్జల్‌ఖాన్

చారిత్రక కట్టడాలను సంరక్షించాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం పాలేగార్స్ వారసులకు ఇస్తున్న తవర్జీ మొత్తాన్ని పెంచాలని, కొంతమందికి అర్ధాంతరంగా నిలిచిపోయిన తవర్జీ పునరుద్దరించాలని ఆంధ్రప్రదేశ్ పాలేగార్స్ వారసుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వై.కేశవులు నాయుడు, ప్రధాన కార్యదర్శి జానకి రఘు కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. పరిపాలన సౌలభ్యం కోసం కాకతీయుల కాలంలో ఆవిర్భవించి విజయనగర కాలంలో బలోపేతంగా పాలేగార్ వ్యవస్థ ఉండేదన్నారు. ప్రజలకు రక్షణ, చెరువుల నిర్మాణం, వ్యవసాయ్యాభివృద్ధి, భూమి శిస్తు వసూలు వంటి విధులను తమ పూర్వీకులు నిర్వహించేవారన్నారు. పలు ప్రాంతాల్లో దేవాలయాలు నిర్మించి ఆధ్యాత్మిక వికాసానికి పాటుపడ్డారన్నారు.పాలేగార్స్ ఆధీనంలోని భూములను స్వాధీనం చేసుకుని నామమాత్రపు తవర్జీ (పెన్షన్) ఏర్పాటు చేశారన్నారు. తమ పూర్వీకులు నిర్మించిన కోటలు, బురుజులు వంటి చారిత్రక నిర్మాణాలను వారసత్వ సంపదగా గుర్తించి పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు మంగమనాయుడు, నలగాటి వెంకటేశ్వర్లు, చంద్రప్ప నాయుడు, బలరామయ్య, నక్కా వెంకట రమణ, పార్థసారథినాయుడు, ఎల్.బాష, ప్రముఖ చరిత్ర పరిశోధకులు తవ్వా ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి - కడప

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని కడప జిల్లా రజక సంఘం జిల్లా అధ్యక్షులు చేలో రవి కోరారు. రాష్ట్ర రజక సంఘం నాయ కుడు విశాఖ పట్నం వాసి అయినా దువ్వారపు రామారావును ఎమ్మెల్సీగా నియ మించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆయనకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరుతున్నామని అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాసిన లేఖను రజక సంఘం జిల్లా అధ్యక్షులు చేలో రవి చూపి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగవసారి రాష్ట్ర ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడుకు రజక సంఘం తరఫున అభినందన శుభాకాంక్షలు తెలియజేస్తున్నామన్నారు. రజక సంఘం నాయకుడైన దువ్వారపు రామారావుకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి నందుకు కూడా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. ముఖ్యంగా రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. ద్వారపు రామారావుకు మంత్రివర్గంలో చోటు కల్పిస్తే రజకులకు అన్ని విధాలుగా న్యాయం జరుగుతుందని లేఖలో పేర్కొన్నామని చెప్పారు. సమావేశంలో రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సి. కృష్ణమూర్తి, జిల్లా ఉపాధ్యక్షులు ఎరికలయ్య, పిచ్చయ్య, గోవిందు గారి కృష్ణయ్య, కె. భాస్కర్, శ్రీను, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చేలో చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి చిన్న గంగన్న, చంద్ర, శేషు పాల్గొన్నారు.



లేఖను చూపిస్తున్న చేలో రవి

ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన లక్ష్మిరెడ్డి

ప్రజాశక్తి-కాశినాయన : ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన వ్యక్తి అరికట్ల లక్ష్మిరెడ్డి అని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ పేర్కొన్నారు మండల పరిధిలోని బాలాయపల్లె గ్రామంలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న అరికట్ల లక్ష్మిరెడ్డి గత నెల 31వ తేదీ ఉద్యోగ విరమణ చెందారు ఈ సందర్భంగా ఆదివారం బాలయ్య పల్లె గ్రామంలోని పాఠశాలలో సన్మాన సభ ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ లక్ష్మి రెడ్డి తన ఉపాధ్యాయ వృత్తిని ఎంతో గౌరవించి, న్యాయం చేసేవారని తెలిపారు. యుటిఎఫ్ యూనియన్‌లో ఎన్నో ఏళ్లు ఉన్నాయని, ప్రతి విషయంలోనూ చాలా పద్ధతిగా చక్కగా ఓర్పు సహనంతో ఉండేవారన్నారు ఎస్‌టియు రాష్ట్ర అదనపు కార్యదర్శి రమణారెడ్డి మాట్లాడుతూ లక్ష్మిరెడ్డి తన ఉద్యోగ జీవితాన్ని ఎంతో చక్కగా అనుభవించారన్నారు. మండల విద్యాశాఖ అధికారి నిర్మల మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి విరమణ తప్పనిసరి అని అయితే లక్ష్మిరెడ్డి తన ఉపాధ్యాయ వృత్తిలో తన ధర్మాన్ని తన పాటించి పిల్లలను ఎంతో గొప్పగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. లక్ష్మిరెడ్డి మాట్లాడుతూ విరమణ చెందినందుకు బాధపడలేదని, కానీ పిల్లల మధ్యన ఉండి ఒక్కసారిగా వారిని విడిచి వెళ్తున్నందుకు బాధగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు జోజయ్య, యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ఎస్‌టియు జిల్లా కమిటీ సభ్యులు సుబ్రమణ్యం, మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ సౌజన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగరంలోని ఎర్రముక్కపల్లి సర్కిల్ సమీపంలో వెలసి ఉన్న శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయం వద్ద ఆదివారం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి జయంతిని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షులు కళ్యా సుధాకర్ మాట్లాడుతూ తొగట వీర క్షత్రియుల ఆరాధ్య కుల దేవత శ్రీ చౌడేశ్వరి దేవి జయంతి వేడుకలు నిర్వహించామని తెలిపారు. వేకువజాము నుంచే అర్చకులు అభిషేకం, విశేష పూజలు చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్న ప్రసాద దాతలు బొలిశెట్టి విజయ మోహన్, సులోచన, ఆలయ కమిటీ కోశాధికారి ఇడెం మల్లికార్జున, సభ్యులు రెబ్బ హరిబాబు, హరినాథ్, కొరముట్ల సుబ్బరాయుడు, వీర నరసింహులు, గోవిందు వెంకటరమణ, వెలిగండ్ల వెంకట సుబ్బరాయుడు, మోతుకూరి సుబ్బరాయుడు, టేకూరి పుష్పాంగద, కలికిరి వెంకటసుబ్బయ్య, సుబ్బు, టేకూరి సుదర్శన్, కాల్వ గంగాధర్, కంచన రవి, రామకృష్ణ, ఆలయ సేవకులు టేకూరు వేదవతి, కాల్వ గౌరీ, కమిటీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.


యామిని కృష్ణమూర్తికి నివాళి

ప్రజాశక్తి- కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సిబ్బంది, పాఠకులు కలసి ఆదివారం నాట్యమయూరి యామిని కృష్ణమూర్తి చిత్రపటానికి పూల మాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ యామిని కృష్ణమూర్తి శనివారం ఢిల్లీలో కన్నుమూశారన్నారు. బాల్యం నుంచే వారికి నాట్యంపై మక్కువ ఎక్కువని, తన 17వ ఏటనే మద్రాసులో తొలి ప్రదర్శన ఇచ్చారన్నారు. 1990లో 'యామిని స్కూల్ ఆఫ్ డ్యాన్స్'ను ఏర్పాటుచేసి అనేకమందికి శిక్షణనిచ్చారన్నారు. వారి ప్రతిభకు తార్కాణంగా పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ వరించా యన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన నర్తకిగా సేవలం దించా రన్నారు. బ్రౌన్ గ్రంథాలయం గ్రంథాలయ సహాయకులు జి.హరి భూష ణరావు మాట్లాడుతూ 1989లో విడుదలైన 'చందనీర్' అనే బెంగాలీ సినిమాలో 'డాక్టర్ యామినీ కృష్ణమూర్తి' అనే తన పాత్రలోనే ఆమె నటించారన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది నీలకంతేశ్వర్, శ్రీను, పాఠకులు సురేష్‌రెడ్డి, వెంకట సుబ్బయ్య, డి.వి.చంద్రశేఖర రెడ్డి పాల్గొన్నారు.

'నాకు పెళ్లిచేసి న్యాయం చేయండి'

ప్రజాశక్తి- కడప అర్బన్

బద్వేల్ మండలం బాలాయపల్లె దళితవాడ గ్రామంలో నివసిస్తున్న తనను ప్రేమించి మోసం చేసిన ఉమామహేశ్వరతో వివాహం చేసి న్యాయం చేయాలని కోరారు. ఆదివారం ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివాహం చేసుకుంటానని మాయమాటలు చెప్పి తాను గర్భం దాల్చిన తర్వాత కువైట్‌కి వెళ్లపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వివాహం కాకుండానే మగ బిడ్డకు జన్మనిచ్చారని తెలిపారు. మోసం చేసిన భర్త, వారి తల్లిదండ్రులపై, అతనికే వత్తాసు పలుకుతున్న పెద్దమనుషులపై కేసు నమోదు చేసి తనకు న్యాయం చేయాలని కోరారు. కలెక్టర్, ఎస్‌పి జోక్యం చేసుకుని కువైట్‌లో ఉన్న ఉమా మహేశ్వరను ఇండియాకు పిలిపించి తనతో వివాహం జరిపించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో బిడ్డతో కలిసి ఆత్మహత్య చేసుకుంటానన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న బాధితురాలు కవిత



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి

ఎస్ఎఫ్ఐ ప్లీనరీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఖాజీపేట

ఎస్ఎఫ్ఐ జిల్లా ప్లీనరీ సమావేశాలు ఈ నెల 7,8 తేదీల్లో జరగనున్నాయని, వాటిని జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుగ్గిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆ మేరకు ఆదివారం మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి చేతుల మీదుగా కరపత్రాల విడుదల చేయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్ మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలోనూ, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలోనూ ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అభినయ్ పాల్గొన్నారు.



గ్రామోత్సవం నిర్వహిస్తున్న ప్రజలు

ఘనంగా చౌడేశ్వరిదేవి జయంతి

ప్రజాశక్తి - ముద్దనూరు

చౌడేశ్వరి దేవి జయంతి సందర్భంగా మండలంలోని ఉప్పలూరు గ్రామంలో చౌడేశ్వరి దేవి ఆలయంలో ఆదివారం గ్రామ ప్రజలు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లా గంగయ్య, ఉప మండలాధ్యక్షురాలు పాలగిరి రేణుక, నాయకులు పల్లా గోపాలకృష్ణ, వీర ప్రతాప్, పెద్ద మాబు పాల్గొన్నారు.

శ్రీశైలం ప్లంజ్ పూల్‌ను తక్షణం పూడ్చాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

శ్రీశైలం డ్యాం కింద ఏర్పడిన ప్లంజ్ పూల్‌ను తక్షణం పూడ్చేయాలని, అలా కానీ పక్షంలో శ్రీశైలం డ్యాం కూలిపోయే ప్రమాదం ఉందని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములపాక ప్రతాప్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రం, రెండు తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణా ఈ భారీ గొయ్యిని పూడ్చి రాయలసీమ రైతులకు ఏర్పడ్డ ప్రమాదాన్ని తొలగించాలని ఆయన సూచించారు. 2009లో భారీ వరదల కారణంగా 25,00,000 క్యూసెక్కుల వరదలు శ్రీశైలం డ్యాం గేట్లుపై నుంచి ప్రవహించిందని, దీనివల్ల 45 మీటర్ల లోతులో, 400 మీటర్ల పొడవు, 270 మీటర్ల వెడల్పుతో భారీ గొయ్యి ఏర్పడిందన్నారు. దీంతో భవిష్యత్తులో భారీ ప్రమాదం పొంచి ఉందన్నారు. నాగార్జున సాగర్ కూడా కొట్టుకుపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే రాయలసీమలో శ్రీశైలం డ్యాం నీళ్లను నమ్ముకొని నారుమళ్లు పోశారని, రాయలసీమ రైతులను కాపాడాలని ప్రతాప్‌రెడ్డి కోరారు.

నేడు వేములలో ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - వేముల

పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు అమర్నాథ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఎస్‌బిఐ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో కంటి సమస్యలు ఉన్నవారు వైద్య శిబిరానికి విచ్చేసి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కంటి పరీక్షలు చేస్తారని తెలిపారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి కడప పుష్పగిరి ఆస్పత్రిలో ఉచితంగా చేస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రెండోరోజూ కొనసాగిన సోదాలు

- పలు కీలకమైన పత్రాలు, పెన్‌డ్రైవ్, ఖరీదైన స్పోర్ట్స్ బైక్ స్వాధీనం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని రావులకొలను గ్రామంలో రెండోరోజూ ఆదివారం కర్ణాటకకు చెందిన స్పెషల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు సోదాలు నిర్వహించారు. అనుమానితుడు నాగేశ్వర్‌రెడ్డి ఇంట్లో స్పెషల్ క్రైమ్ బ్రాంచ్ సిఐ నేతృత్వంలో కుటుంబ సభ్యులను విచారించారు. నాగేశ్వర్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమి నాడు రాష్ట్రాల్లో పలు సైబర్ క్రైమ్ కేసులు నమోదైనట్లు తెలిసింది. ముఖ్యంగా ఇటీవల కర్ణాటకకు చెందిన రాజకీయ నాయకుని కుటుంబ సభ్యులది సైబర్ క్రైమ్ మోసం చేసి భారీ స్థాయిలో ఆన్‌లైన్ ద్వారా తమ ఖాతాలోకి జమ చేసినట్లు తెలిసింది. దీంతో పాటు కాల్‌డేటా, చోరీతోపాటు ఇతర సైబర్ క్రైమ్ పాల్పడినట్లు సమాచారం. రెండోరోజు నాగేశ్వర్‌రెడ్డిని వెంటబెట్టుకుని తీసుకొచ్చిన కర్ణాటక పోలీసులు ఇంట్లో సోదాలు నిర్వహించి కీలకమైన సెల్‌ఫోన్, ట్యాబ్, లాప్‌టాప్, పెన్‌డ్రైవ్, హార్డ్ డిస్క్, కీలక పత్రాలు, అత్యంత ఖరీదైన స్పోర్ట్స్ బైక్, కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు సైతం స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి ఎస్ఐ అనిల్‌కుమార్‌తో చర్చించారు. గతంలో కర్ణాటక మద్యం తరలిస్తూ పులివెందులలో స్థానిక ఎస్ఐ గోపీనాథ్‌రెడ్డి ఆపమని కోరగా, ఎస్ఐపై రోడ్డుపైన ఢీ కొట్టిన ఘటన అప్పట్లో సంచలనగా మారింది.

క్రైం కార్నర్



ప్రమాదంలో మృతి చెందిన చందు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధి 167 జాతీయ రహదారిపై ఇందిరమ్మ కాలనీ వద్ద ఆదివారం ఆర్‌టిసి బస్సును ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో చందు (19) అనే యువకుడు దుర్మరణం చెందగా, రాజేష్ అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడపకు తరలించారు. పోలీసులు అందించిన వివరాల మేరకు.. యువకులు ఇద్దరు దువ్వూరు మండలం నేలటూరుకు చెందినవారు. మైదుకూరు పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. వారిద్దరూ స్నేహితులని స్థానికులు తెలిపారు. సొంత పనుల నిమిత్తం ఇద్దరు యువకులు దువ్వూరు నుంచి మిట్టమానపల్లెకు వెళుతున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్నేహితుల దినోత్సవం రోజు నేలటూరు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

మొక్కజొన్న సాగుపై రైతుల్లో ఆసక్తి

90 నుంచి 120 రోజుల్లో పంట చేతికి.. తక్కువ ఖర్చు-అధిక దిగుబడి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మొక్కజొన్న సాగుపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. 90 నుంచి 120 రోజుల్లో పంట చేతికి రావడమే కాకుండా.. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వస్తుంది. మొక్కజొన్న పొత్తులకు, ఎండిన గింజలకు మంచి ధర లభిస్తోంది. ఈ నేపథ్యంలో రైతులు ఖరీఫ్‌లో మొక్కజొన్న పంటను సాగు చేశారు. పులివెందుల నియోజకవర్గం పరిధిలో ఖరీఫ్‌లో 2,500 ఎకరాల్లో మొక్కజొన్న పంట వేస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మొక్కజొన్న సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే తక్కువ ఖర్చుతో ఆశించిన అధిక దిగుబడులు పొందవచ్చని అధికారులు చెబుతున్నారు. 100 నుంచి 120 రోజుల్లో పంట చేతికి వచ్చే దీర్ఘకాలిక రకాలు డీహెచ్ఎం-113, బయో-9681, 900ఎంగోల్డ్‌బీ 90 నుంచి 100 రోజుల్లో పంట చేతికి వచ్చే మధ్యకాలిక రకాలు డీహెచ్ఎం-111, డీహెచ్ఎం-119, కేహెచ్-510, కేహెచ్-9541, బయో-9637, ఎంసీహెచ్-2, కోహినూర్, కేఎంహెచ్-25కె60. 90 రోజులకన్నా తక్కువ కాలపరిమితి ఉన్న డీహెచ్ఎంఎం-1, వీఎల్49, ఎంఎంహెచ్-133, ఎంఎంహెచ్-3342 రకాలు అనుకూలం. ఎకరానికి హైబ్రిడ్ రకాలు 7-8 కిలోలు, తీపి మొక్కజొన్న 3-4 కిలోలు, పేలాల మొక్కజొన్న 5 కిలోల విత్తనాలు అవసరం అవుతాయి. ఎకరాకు 175 కిలోల యూరియా, 150 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 35 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు అవసరం అవుతాయని రైతులంటున్నారు. మొక్కజొన్న పంటలో కలుపు నివారణకు అట్రాజెన్ మందుకు బదులు పెండిమిథాలిన్ మందును ఎకరాకు ఒక లీటరు చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. విత్తిన 30 రోజుల తర్వాత 2-4-డి సోడియం సాల్ట్



సాగుచేసిన మొక్కజొన్న పంట

ఎకరాకు అర కిలో చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన 30-45 రోజులకు అంతర కృషి చేసి కలుపు మొక్కలను నివారించుకోవాలి. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు మెండుగానే కురుస్తాయి. కాబట్టి ప్రత్యేకంగా నీటిని పెట్టాల్సిన అవసరం ఉండదు. ఒకవేళ పూతకు ముందు, పూత దశలో, గింజ పాలుపోసుకునే దశలో వర్షం పడకపోతే నీరు పెట్టాల్సి ఉంటుంది. మొక్కజొన్న పైరును కాండం తొలుచు పురుగు ఆశిస్తుంటుంది. దీని నివారణకు మోనోక్రోటోఫాస్ మందును లీటరు నీటికి 1.6 మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలి. ఎకరాకు మూడు కిలోల కార్బోఫ్యూరాన్ గుళికల మందును మొవ్వు సుడుల్లో వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

నేటి నుంచి గండిలో శ్రావణ మాసోత్సవాలు

నాలుగు శనివారాల పాటు ప్రత్యేక పూజలు-అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు



గండి క్షేత్ర ముఖ చిత్రం

ప్రజాశక్తి - చక్రాయ పేట

పులివెందుల నియోజకవర్గంలోని చక్రాయపేట మండలం పాపాగ్ని నది ఒడ్డున వెలిసిన గండి క్షేత్రంలోని వీరాంజనేయ స్వామి శ్రావణమాస మాసోత్సవాలు సోమవారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈనెల 10వ తేదీ మొదటి శ్రావణ శనివారాన్ని వైభవంగా నిర్వహిస్తామని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ జె.వెంకట సుబ్బయ్య, ఆలయ ప్రధాన అర్చకులు కేసరి స్వామి, ఉప ప్రధాన అర్చకులు రాజా స్వామి తెలిపారు. ఈనెల 17న రెండవ, 24న మూడవ, 31న నాలుగవ శనివారాల ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు.

ఎత్తైన కొండల నడుమ పాపాగ్ని..

ఆలయ సమీపంలోనే సుమారు 2 వేల అడుగుల ఎత్తైన కొండల నడుమ పాపాగ్ని నది ప్రవహిస్తూ ఉంటుంది. ఈ సుందర దృశ్యం పలువురిని ఆకొట్టుకుంటుంది. గండిక్షేత్రం తీర్థాలలో పాపఘ్ని తీర్థం అతి పవిత్రంగా భావిస్తారు. దత్త మండలాలు ఉన్నప్పుడు కలెక్టర్‌గా పనిచేసిన థామస్ మన్రో విదేశాల యువకుడైన్నా, భారత సంస్కృతి గురించి అవగాహన లేకపోయినా పవిత్ర హృదయుడుగా ఉండేవారు. అందుకే అతనికి గండి క్షేత్రంలో స్వర్ణ విజయతోరణం దర్శనం ఇచ్చిందని కలెక్టర్ గెజిటెడ్‌లో రాసినట్లు పలువురు పేర్కొంటున్నారు. పాపాగ్ని నది కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా నందిగానులో పుట్టి సుదీర్ఘంగా అనంతపురం జిల్లాలో వ్యాపించి చిత్తూరు జిల్లా నుంచి కడప జిల్లాలోని వెలిగల్లు ప్రాజెక్టు నుండి గండి క్షేత్రం ఆంజనేయ స్వామి పాదాల వద్ద ప్రవహిస్తూ సంఘమేశ్వరు వద్ద పెన్నా నదిలో అంతర్భాగమవుతుందని చరిత్ర చెబుతుంది.

గండి అంజన్న క్షేత్రానికి చేరుకోవాలంటే..

గండి వీరాంజనేయ స్వామి ఆలయానికి చేరుకోవాలంటే తిరుపతి నుంచి పీలేరు, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె మీదుగా గండి క్షేత్రానికి చేరుకోవచ్చు. కర్నూలు నుంచి వచ్చే భక్తులకు కడప మీదుగా వేంపల్లి నుండి గండి క్షేత్రానికి చేరుకోవచ్చు. అనంతపురం నుంచి పులివెందుల మీదుగా వేంపల్లి గండి క్షేత్రానికి చేరుకోవచ్చు. జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు మీదుగా ఎర్రగుంట్ల, వేంపల్లి నుంచి క్షేత్రానికి చేరుకోవచ్చు. ప్రతి ఏడాది ఇతర రాష్ట్రాల నుంచి కూడా అధిక సంఖ్యలో శ్రావణమాసోత్సవాలు తిలకించేందుకు యాత్రికులు విచ్చేస్తుంటారు.

తమిళనాడు రాష్ట్రం అంబురీరు నుంచి ప్రత్యేక పూల అలంకరణ చేయిస్తారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక విద్యుత్ లైట్లు ఏర్పాటు చేస్తారు. యాత్రికులకు వసతి సౌకర్యం క్యూలైన్లు, తాగునీరు, నిరంతరంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తారు. మొబైల్ టాయిలెట్స్, చలువ పందిళ్ళు, పోలీస్ అవుట్ పోస్టు, వైద్య శిబిరం వంటి సౌకర్యాలు కల్పిస్తారు. యాత్రికుల కాలక్షేపానికి పౌరాణిక నాటకాలు, కోలాట భజనలు నిర్వహిస్తారు. వేంపల్లి వైపు నుంచి వచ్చే యాత్రికులకు వీరన్నగట్టుపల్లె, రాయచోటి వైపు నుంచే వచ్చే వారికి అద్దాలమర్రి క్రాస్ నుంచి గండి క్షేత్రానికి ఉచిత బస్సు సౌకర్యాలు ఏర్పాటు చేస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలి



గండి క్షేత్రానికి వచ్చే భక్తుకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటుతోపాటు, ఉచిత వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేస్తాం.

- జె.వెంకటసుబ్బయ్య ఆలయ అసిస్టెంట్ కమిషనర్, గండి క్షేత్రం

ఆకట్టుకునేలా అలంకరణ





శ్రావణ మాసఉత్సవాల్లో ప్రతిరోజు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు పలు రకాల పాలు, పండ్లతోపాటు పూల అలంకరణ ఆకట్టుకునేలా చేస్తాం. పార్టీలు, కులమతాలకు అతీతంగా దర్శనం చేయిస్తాం. **- కేసరి స్వామి, ప్రధాన అర్చకులు, రాజస్వామి, ఉప ప్రధాన అర్చకులు**

ముమ్మరంగా వ్యవసాయ పనులు



నారు పోసేందుకు ఎడ్ల బండిపై వరి విత్తనాలను తీసుకెళుతున్న రైతు

ప్రజాశక్తి - చాపాడు

కెసి కాలువకు నీరు విడుదల కావడంతో రైతులు పూర్తిగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. దుక్కిళ్ళు, వరి నారు సాగుకు ఏర్పాట్లు, కాలువలలో పూడికతీత, నారుమడి కయ్యల ఏర్పాటు వంటి పనుల్లో వారు లీనమయ్యారు. పంట పొలాల్లో ఎక్కడ చూసినా రైతులు పనులు చేస్తూ కనిపిస్తున్నారు. జిల్లాలో తక్కువ వర్షపాతం నమోదైనప్పటికీ కర్ణాటక, మహారాష్ట్రలో అత్యధిక వర్షంతో శ్రీశైలానికి సకాలంలో నీరు చేరింది. ఈ పరిస్థితుల్లో కెసి కాలువకు అధికారులు నీరు విడుదల చేశారు. రైతులు ఊహించని విధంగా ముందస్తుగా కెసి కెనాల్‌కు నీరు విడుదల కావడంతో రైతులు ఆయా పనుల్లో బిజీ అయ్యారు. ఎక్కువగా విత్తనపు వడ్లను సేకరిస్తున్నారు. 25 కిలోల విత్తనాల వడ్లు రూ.1.250 నుంచి రూ.1,500 వరకు అమ్మకాలు చేస్తున్నారు. మైదుకూరు, ఖాజీపేట, ప్రొద్దుటూరు, నంద్యాల నుంచి విత్తనపు వడ్లను రైతులు సేకరిస్తున్నారు.

కెసి ఉప కాలువకు నీరు విడుదల

ప్రజాశక్తి - ఖాజీపేట

కెసి ఆయకట్టు పరిధిలోని కొండపేట ప్రధాన కాలువ ఒకటవ నంబర్ ఉప కాలువకు ఆదివారం ఖాజీపేట ఎంపిటిసి సభ్యులు డి.ఎస్.చంద్రభాస్కర్ రెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ కాలువ ఆయకట్టు పరిధిలో 2,940 ఎకరాల సాగు విస్తీర్ణం ఉంది. బుడ్డాయపల్లె, సిద్దాంతిపురం, బీచువారిపల్లె, సుంకేసుల, అగ్రహారం, నందిపాడు గ్రామాలకు సాగునీరు అందుబాటులోకి రానుంది. నీటి విడుదల సందర్భంగా జల హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమం కేశవ్‌రెడ్డి, వెంకట రమణ, వెంకట సుబ్బయ్య, వెంకటేష్, రిజ్వాన్, నాగిరెడ్డి పాల్గొన్నారు.



నీటిని విడుదల చేస్తున్న ఎంపిటిసి డిఎస్ చంద్రభాస్కర్‌రెడ్డి

సచివాలయ సముదాయం సుందరీకరణ

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలోని హిమకుంట్ల సచివాలయ సముదాయాన్ని సుందరీకరణలో భాగంగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. మాజీ జెడ్పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు సచివాలయ సముదాయంతో పాటు సీతారాముల ఆలయానికి రెండు ఎకరాల భూమిని ఉచితంగా అందజేశారు. గత ప్రభుత్వ హాయంలో గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే సచివాలయ ప్రాంగణం పిచ్చి మొక్కలు, మట్టి దిబ్బలతో అధ్వానంగా ఉండేది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ సుందరీకరణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. సచివాలయ ప్రాంగణంలో పాదాచారులు రావడానికి ప్రత్యేక రోడ్డు, పూలచెట్ల ఏర్పాటు, చెట్లు చుట్టూ కూర్చోవడానికి అరుగులు ఏర్పాటు పనులు, చెట్లు అన్నిటికి డ్రిప్పు ద్వారా నీటి తడులు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో సచివాలయం కొత్త కళను సంతరించుకోనుంది.



చేపట్టిన సుందరీకరణ పనులు

అప్పనపల్లెలో పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

చిన్నపాటి వర్షాలకు ఆయా గ్రామాల్లో వీధులు జలమయమవుతున్నాయి. వర్షపునీరు రోజుల తరబడి నిల్వ ఉంటుండడంతో వచ్చే దుర్వాసనతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మురుగు నీరు బయటకు వెళ్లేందుకు తగిన ఆస్కారం లేకపోవడంతో స్థానికులు ఇక్కట్లకు గురవుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్యలోపంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. మురుగు పారుదల వ్యవస్థ సక్రమంగా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలం పరిధిలోని అప్పనపల్లె గ్రామంలో పారిశుధ్య సమస్య తీవ్రంగా వేధిస్తోంది. చిన్న వర్షానికి మురుగు పెద్ద ఎత్తున ప్రధాన రహదారిపైకి వచ్చి చేరుతుంది. మురుగు నీరు బయటకు వెళ్లేందుకు మెరుగైన డ్రయినేజీ వ్యవస్థ అందుబాటులో లేక సమస్య జఠిలమైందని వాపోతున్నారు. అనారోగ్యానికి గురవుతున్నామని, దోమలు బెడద అధికంగా ఉందని భయాందోళనలను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు దృష్టి సారించి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.





విద్యార్థులకు సలహాలిస్తున్న రిసోర్స్ పర్సన్ సతీష్

నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - వేంపల్లె

నైపుణ్యం అనేది ఉంటేనే ఉద్యోగ అవకాశం అనేవి మన ముందుకు వస్తాయని రిసోర్స్ పర్సన్ సతీష్ విద్యార్థులకు సూచించారు. ఆదివారం ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లోని సిఎస్ఇ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగ అవకాశాలపై పైథాన్ ఫుల్ స్టాక్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉద్దేశించి రిసోర్స్ పర్సన్ సతీష్ మాట్లాడుతూ ఆయా రంగాల్లో రాణించేందుకు నైపుణ్యం అనేది ప్రతి విద్యార్థి ప్రదర్శించాలని కోరారు. నైపుణ్యం అనేది లేకపోతే ఉద్యోగ అవకాశాలు రావడం కష్టమన్నారు. విద్యార్థి దశలోనే కష్టపడి చదవాలని కోరారు. అనంతరం ఇంటర్వ్యూకు వెళ్లే విద్యార్థులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, డీన్ అకాడమీ రత్నకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పూర్వపు అధ్యక్షులను సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

వాసవిక్లబ్ అభివృద్ధికి ఎనలేని కృషి

ప్రజాశక్తి -పులివెందుల రూరల్

వాసవి క్లబ్ అభివృద్ధికి ప్రతి ఒక్కరి కృషి విలువ కట్టలేనిదని వాసవి క్లబ్ అధ్యక్షుడు సగల మహేంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అమ్మవారి శాలలో స్నేహితుల దినోత్సవం సందర్భంగా మహేంద్రబాబు ఆధ్వర్యంలో పులివెందుల పూర్వ అధ్యక్షులుగా సేవ చేసిన మాలపాటి విజయకుమార్, కొప్పరపు రాజేంద్రప్రసాద్, పబ్బతి దక్షిణామూర్తి, మేడం దినేష్, పద్మనాభయ్య, కొత్త రవికుమార్, పట్టాభి రామయ్య , పెంజూరు నాగభూషణం, దిండుకుర్తి నాగభూషణంను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహేంద్రబాబు మాట్లాడుతూ స్నేహితుల దినోత్సవం సందర్భంగా వాసవిక్లబ్ అభివృద్ధికి, ఆర్యవైశ్యుల అభివృద్ధికి ఎన్నో విధాలా సహాయ సహకారాలు అందించిన పూర్వ అధ్యక్షులుగా సేవలందించిన వారి అందరికీ సన్మానం చేశామన్నారు. తామందరం కలిసికట్టుగా వాసవిక్లబ్ ఆధ్వర్యంలో మరెన్నో సేవా కార్యక్రమాలు చేపడతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ సెక్రటరీ రొట్టెల వినోద్‌కుమార్ పాల్గొన్నారు.



సిఎం చంద్రబాబుకు వినతిపత్రమిస్తున్న సానే రాహుల్

చంద్రబాబును కలిసిన సానే రాహుల్

ప్రజాశక్తి - చక్రాయపేట

మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును దేవరగట్టుపల్లె టిడిపినేత నెరుసుపల్లె మాజీ సర్పంచ్ సానే సుబ్బరామయ్య కుమారుడు సానే రాహుల్ కలిశారు. ఈ సందర్భంగా రాహుల్ ప్రజా సమస్యల గురించి సిఎంకు ప్రత్యేకంగా వివరించారు. ఇందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని రాహుల్ పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై సిఎం చంద్రబాబు ప్రత్యేకదృష్టి సారించారని, వెంటనే వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తున్నారని తెలిపారు.

జిల్లాలో కరువు రక్కసి : తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

జిల్లాలో కరవు రక్కసి కరాల నృత్యం చేస్తున్నట్లు పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నట్లు చెప్పారు. జిల్లాలో ఖరీఫ్ సాగు లక్ష్యం 79,115 హెక్టార్లుండగా.. కేవలం 17 వేల హెక్టార్లలో మాత్రమే రైతులు సాగు చేశారన్నారు. వర్షాలు లేక 7 వేల హెక్టార్లలో పంట ఎండి పోయిందన్నారు. మిగతా పంటలు కూడా ఎండి పోయేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. పత్తి 5,722 హెక్టార్లలో, వరి 3,259 హెక్టార్లు, మొక్కజొన్న 849 హెక్టార్లు, కొర్ర 430 హెక్టార్లు, కంది 432 హెక్టార్లు, మినుము 3,247 హెక్టార్లు, వేరుశెనగ 2,344 హెక్టార్లు, ఆముదం 156 హెక్టార్లు, సోయాబీన్ 258 హెక్టార్లల్లో పంట ఎండిపోయిందని వివరించారు. ఇప్పటికే ఎండిపోయిన పంటలను రైతులు దున్నేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం పంట నష్టంపై సర్వే చేసి రైతులకు పరిహారం చెల్లించాలని కోరారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

ప్రజాశక్తి - వేంపల్లె

భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ సంఘం జిల్లా అధ్యక్షుడు బల్లారపు రామాంజనేయులు, ఉపాధ్యక్షుడు చల్లా బాలాజీ కోరారు. ఆదివారం కార్మిక సభ్యులతో కలిసి కడపలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇందుకు వారు స్పందించి వెంటనే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. వినతి పత్రాన్ని అందజేసిన వారిలో నాగేశ్వరరావు, బుజ్జి, కిట్టయ్య, శ్రీను పాల్గొన్నారు.

కాలువలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - చాపాడు

బెంగళూరు-విజయవాడ నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో భాగంగా పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్లు పంట కాలువలను పూడ్చి వేశారు. ప్రస్తుతం కెసి కాలువకు నీరు విడుదల కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డు నిర్మాణంలో భాగంగా గతంలో ఉన్న కాలువలను రోడ్డు నిర్వాహకులు పూడ్చి వేశారు. ప్రస్తుతం పంటలు సాగు చేసుకునే రైతులు నీరు వచ్చే అవకాశం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు రైతులు ఫిర్యాదు చేయడంతో కొన్ని ప్రదేశాల్లో కాలువలు ఏర్పాటు చేశారు. కొన్ని ప్రదేశాల్లో అలాగే వదిలేశారు. దీంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైవే రోడ్డు నిర్వాహకులను పదేపదే అడుగుతున్నప్పటికీ వారు ఏమాత్రం స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది స్పందించి వ్యవసాయానికి ఇబ్బంది లేకుండా కాలువలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



సిద్ధారెడ్డిపల్లె వద్ద కాలువను ఏర్పాటు చేస్తున్న జెసిబి యంత్రం